# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 04-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ జార్ఖండ్ పూర్వ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంతాపం వ్యక్తంచేశారు.
- ❖ ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళా కింద గడచిన 16 నెలల్లో 11 లక్షలకు పైగా ఉద్యోగ కల్పన జరిగిందని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు.
- ❖ ఫిలిప్పీన్స్ అధ్యక్షులు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్ జూనియర్ ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు భారత్ కు చేరుకున్నారు.
- ❖ ఆద్యంతం పోటా పోటీగా జరిగిన అండర్ సన్ టెండూల్కర్ సిరీస్ డ్రాగా ముగిసింది.

==============================

పార్లమెంట్ ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి. బీహార్ ఎన్నికల జాబితాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) చేపట్టడాన్ని నిరసిస్తూ.. విపక్షాలు నిరసనలు చేయడంతో లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. తిరిగి మధ్యాహ్నం సభ సమావేశమైనప్పుడు ప్రతిపక్ష సభ్యులు SIR పై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. జాతీయ క్రీడా పాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025పై చర్చించాలని ముందుగా నిర్ణయించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరెన్ రిజిజు సభ్యులకు తెలిపారు. అయినా విపక్షాలు నిరసన కొనసాగించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

(వాయిస్ 39 సెకన్లు)

==============================

జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆ రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి శిబు సోరెన్ ఈ రోజు ఉదయం న్యూఢిల్లీలో మృతి చెందారు. 81 సంవత్సరాల ఆయన కిడ్నీసంబంధిత వ్యాధితో బాధపడుతూ గత నెల రోజులుగా చికిత్స పొందుతున్నారు. శిబు సోరెన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహా పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం సామాజిక న్యాయ రంగానికి తీరని లోటని రాష్ట్రపతి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజల సంక్షేమంపైనా.. ప్రత్యేకించి గిరిజన వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. అంకితభావంతో ప్రజలకు సేవ చేస్తూ.. అట్టడుగు స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదిగిన నాయకుడు శిబు సోరెన్ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సందేశంలో పేర్కొన్నారు.

==============================

ప్రధానమంత్రి రోజ్‌గార్ మేళా కార్యక్రమం కింద గడచిన 16 నెలల్లో 11 లక్షలకు పైగా ఆశావాహులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానమిస్తూ... ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, గత దశాబ్దంలో 17 కోట్లకు పైగా యువతకు ఉపాధి లభించిందని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్ళలో 4 కోట్లకు పైగా ఉద్యోగాలు కల్పించే దిశగా పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద 2 లక్షల కోట్ల రూపాయలు కేటాయించామని తెలియజేశారు. ఎన్‌డియే ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగంలో ఉద్యోగ సృష్టి గణనీయంగా పెరిగి, 19 శాతానికి చేరిందన్నారు. అలాగే సేవా రంగంలోను ఉద్యోగ సృష్టి తమ ప్రభుత్వ హయాంలో 36 శాతానికి పెరిగిందన్న కేంద్ర మంత్రి... నిరుద్యోగిత రేటు 3.2 శాతానికి తగ్గిందని సభకు తెలియజేశారు.

==============================

భారత్.. తమకు విలువైన స్నేహ పూర్వక దేశమని ఫిలిప్పీన్స్ అధ్యక్షులు ఫెర్డినాండ్ ఆర్.మార్కోస్ జూనియర్ పేర్కొన్నారు. 5 రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు మధ్యాహ్నం భారతదేశానికి చేరుకున్నారు. అంతకు ముందు ఒక సందేశాన్ని విడుదల చేశారు. భారతదేశంతో ద్వైపాక్షిక సంబంధాలు వివిధ రంగాల్లో విస్తృత పరిధిలో అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజాస్వామ్య విలువలు ద్వైపాక్షిక సంబంధాలకు పునాదిగా నిలుస్తాయన్నారు. ఉభయ దేశాలకు పరస్పరం ప్రయోజనం చేకూర్చేలా సహకారానికి భారత్‌లో మెండుగా అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రక్షణ రంగం, వాణిజ్యం, ఆరోగ్యం, ఔషధాలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల్లో పరస్పర సహకారానికి విస్తారంగా అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు.

==============================

ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (PMMVY) కోసం చేపట్టిన ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించింది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పోషకాహారాన్ని అందించడంతో పాటు, బాలికల పట్ల సానుకూల దృక్పథాలను ప్రోత్సహించడానికి PM మాతృ వందన యోజన ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి ఈ పథకంపై అవగాహన కలిగించి, అర్హులైన వారి పేర్లను నమోదు చేసుకోవడం జరుగుతుంది. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుండి 4.05 కోట్లకు పైగా లబ్ధిదారులకు 19 వేల 28 కోట్ల రూపాయల ప్రసూతి ప్రయోజనాన్ని చెల్లించిందని ఆ మంత్రిత్వ శాఖ ఒక ప్రటనలో వెల్లడించింది.

విరామం

==============================

భారత్ అమెరికా దేశాల మధ్య సుంకాలు, తదనంతర పరిణామాలకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు కథనాలు వస్తున్నాయని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు చెందిన నిజనిర్ధారణ విభాగం వెల్లడించింది. విదేశీ వ్యవహాల మంత్రిత్వ శాఖ, అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పేరిట కొన్ని ఖాతాలు అసత్య వ్యాఖ్యలు ప్రసారం చేశాయని పేర్కొంది. ఆన్‌లైన్‌లో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అటువంటి సమాచారాన్ని విశ్వసించే ముందు, అలాగే ఇతరులతో పంచుకునే ముందు అధికారిక వెబ్‌సైట్లలో ఉన్న సమాచారం ఆధారంగా తనిఖీ చేసుకోవాలని ప్రజలకు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాల్వన్ లోయలో చైనాతో జరిగిన ఘర్షణలకు సంబంధించి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భారత్ సైన్యంపై చేసిన వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అటువంటి అంశాలను ఆయన సామాజిక మాధ్యమాల్లో కాక.. పార్లమెంట్‌లో లేవనెత్తవలసి ఉందని జస్టిస్ దీపాంకర్ దత్తా, ఎ.జి. మాసిహ్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుందన్న రాహుల్ గాంధీ వ్యాఖ్యలను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ ఎన్నికల జాబితాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) సవరణలు చేపట్టడంపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేయడం సరికాదని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు. ఈరోజు ఆయన పార్లమెంటు వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతిపక్షాల తీరును తప్పుబట్టారు. దేశంలో SIR జరగడం ఇది మొదటిసారి కాదని, గతంలో చాలాసార్లు జరిగిందని గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకులకు ఎన్నికల కమిషన్, సుప్రీం కోర్టులపై విశ్వాసం లేదని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలంగాణలోని కీలకమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించి జరిగిన అవకతవకలకు అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు జవాబుదారీ అని పి.సి. ఘోష్ కమిషన్ నిర్ధారించింది. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, ఇతర దశల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపింది. గత నెల 31వ తేదీన కమిషన్.. తెలంగాణ ప్రభుత్వానికి నివేదికను సమర్పించగా నివేదికను అధ్యయనం చేసి సమగ్ర సారాంశాన్ని సిద్ధం చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 1వ తేదీన ఒక కమిటీని ఏర్పాటు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆద్యంతం పోటా పోటీగా జరిగిన అండర్ సన్ టెండూల్కర్ సిరీస్ డ్రాగా ముగిసింది. ఈరోజు లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై భారత్ విజయం సాధించడంతో సిరీస్ సమం అయ్యింది. తొలి మ్యాచ్‌లో ఇంగ్లాండ్, రెండవ మ్యాచ్‌లో భారత్, మూడవ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్లు విజయం సాధించడంతో పాటు.. నాల్గవ మ్యాచ్ డ్రాగా ముగియడంతో ఐదవ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. ఇరు జట్లు వీరోచితంగా పోరాడడంతో ఈ టెస్ట్ సిరీస్ క్రికెట్ అభిమానులకు ఒక మరువ లేని జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న 3 రోజుల్లో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కూడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =